## ఉచిత కంటి, రక్త పరీక్షలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

**ఆల్విన్‌కాలనీ:** ఆల్విన్‌కాలనీ, ఎల్లమ్మబండలోని పట్నంలో పాలమూరు బిడ్డల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వాసన్ ఐ కేర్ సౌజన్యంతో ఆదివారం ఉచిత వైద్య పరీక్షల శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో 90 మందికి కంటి పరీక్షలు, రక్త పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం వ్యవస్థాపక సభ్యులు గోపాస్ రవీందర్, శ్రీధర్ పంతులు, కే. వెంకటేష్, గోపాస్ చంద్రశేఖర్, కురమయ్య, శ్రీరామ్, సంతోష్, సాయి, వాసన్ ఐ కేర్ సంస్థ సభ్యులు శివ బాలు తదితరులు పాల్గొన్నారు.

## అన్ని దానాల్లో అన్నదానం గొప్పది



**మోతీనగర్:** అన్ని దానాల కన్నా అన్నదానం గొప్పదని మోతీనగర్ సీనియర్ సిటిజన్ కౌన్సిలింగ్ ఫోరం ప్రతినిధులు అన్నారు. ఆదివారం ఎర్రగడ్డ ప్రభుత్వ మానసిక వైద్య శాల రోగులకు, వారి సహాయకులకు సీనియర్ సిటిజన్ మోతీనగర్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఒక్కరూ సంపాదించిన దానిలో కొంతైనా సమాజాభివృద్ధి కోసం కేటాయించాలని కోరారు.

## మాజీ కౌన్సిలర్ సంతాప సభ



నివాళులర్పిస్తున్న నేతలు, మిత్రులు

**మూసాపేట:** భరత్‌నగర్ కాలనీలోని పోచమ్మ గ్రౌండ్‌లో ఆదివారం దివంగత మాజీ కౌన్సిలర్ కొమ్మా శివ లింగారెడ్డి సంతాప సభ నిర్వహించారు. భరత్‌నగర్ కాలనీ ఆత్మీయ మిత్రుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సంతాప సభ, అన్న సమారాధనలో వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు. వారు తనతో ఉన్న సంబంధాన్ని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ఫతేనగర్ డివిజన్ కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్, మూసాపేట మాజీ కార్పొరేటర్ శ్రావణ్‌కుమార్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్, నాయకులు సత్యం శ్రీరంగం, గొట్టిముక్కల వెంగళరావు, వెంకటేశ్వరరావు, నాగిరెడ్డి, జగదీష్, వేణు, నిర్వాహకులు, ఆత్మీయ మిత్రులు మనోహర్ రెడ్డి, ప్రసాద్ రెడ్డి, గోపాల్ రెడ్డి, జగదీష్ రెడ్డి పాల్గొన్నారు.

## గృహిణి అదృశ్యం



ఉమారాణి

**బాలానగర్:** గుడికి వెళ్లొస్తానని ఇంట్లో చెప్పి బయలుదేరి వెళ్లిన ఓ గృహిణి తిరిగి ఇంటికి రాలేదు. ఈ ఘటన బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం జరిగింది. బాలానగర్ సీఐ టి.నరసింహరాజు వివరాల ప్రకారం.. బాల్‌రెడ్డి నగర్‌లో రమేష్ బాబు –ఉమారాణి దంపతులు తమ కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటున్నారు. ఆదివారం ఉదయం ఇంట్లో గుడికి వెళ్లి వస్తానని చెప్పి ఇంట్లోంచి ఉమారాణి(26) బయలుదేరింది. సాయంత్రం అయినప్పటికీ ఆమె తిరిగి ఇంటికి రాలేదు. బంధువులు, స్నేహితులు ఇండ్లలో గాలించారు. ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో ఆమె భర్త రమేష్ బాబు బాలానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం



**కుత్బుల్లాపూర్:** ప్రజాశ్రేయస్సే పరమావధిగా సీఎం రేవంత్‌రెడ్డి పని చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. ఆదివారం నియోజకవర్గ పరిధిలోని పలు బస్తీలు, కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు ఆయనను షాపూర్‌గనర్‌లోని నివాసంలో కలిశారు. తమ ప్రాంతాల్లో నెలకొన్న పలు సమస్యలతో కూడిన వినతి పత్రాలు, ఆహ్వాన పత్రికలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నానని, ఏ సమస్య ఉన్నా తన దృష్టికి వచ్చిన వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.

# మరింత చేరువగా వైద్యం..

## మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో టెలీమెడిసిన్ సేవలు

- మల్కాజిగిరి ప్రభుత్వాసుపత్రితో సీహెచ్‌సీలు, పీహెచ్‌సీలు అనుసంధానం
- సేవలు పొందుతున్న రోగులు
- ఉస్మానియా, గాంధీ, నిమ్స్ నుంచి సైతం సేవలు

**సాక్షి,సిటీబ్యూరో:** ప్రభుత్వం ప్రవేశపెట్టిన టెలీమెడిసిన్‌తో జిల్లా ప్రజలకు వైద్యసేవలు మరింత చేరువయ్యాయి. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని మల్కాజిగిరి జిల్లా ఆసుపత్రితో రెండు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, 12 సీహెచ్‌సీలు, 24 యూపీహెచ్‌సీలు అనుసంధానం చేశారు. టీవీ, కంప్యూటర్ ద్వారా రోగులను పరీక్షించి మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నారు.

◆ జిల్లావ్యాప్తంగా 24 యూపీహెచ్‌ఎస్, 4 పీహెచ్‌సీలు, ఒక ఏరియాసుపత్రి, రెండు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లను మల్కాజిగిరి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి అనుసంధానం చేశారు.

◆ అలాగే హైదరాబాద్‌లోని ఉస్మానియా, నిమ్స్, గాంధీ ప్రభుత్వాసుపత్రులకు మల్కాజిగిరి జిల్లా ప్రభుత్వాసుపత్రిని అనుసంధానం చేశారు.

◆ మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాకు చెందిన 40 ఆసుపత్రులు, ఆరోగ్య కేంద్రాల నుంచి కూడా రోగులు ఇక్కడి సేవలు పొందేలా ఏర్పాటు చేశారు.

◆ అన్ని కేంద్రాల్లో టెలీ మెడిసిన్ సేవలు నిరంతరం కొనసాగుతున్నాయని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ .రఘునాథ్‌స్వామి పేర్కొన్నారు.

**ఈ ప్రాంతాల్లో టెలీమెడిసిన్ సేవలు**

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ఘట్‌కేసర్, మేడ్చల్ కమ్యూనిటీహెల్త్ సెంటర్లు, మూడుచింతలపల్లి, శామీర్‌పేట, కీసర, జవహర్‌నగర్, కుషాయిగూడ, శ్రీరంగవరం, నారపల్లి, ఉప్పల్, మల్కాజిగిరి, కుత్బుల్లాపూర్, బాలానగర్, అల్వాల్ పీహెచ్‌సీలతో పాటు మచ్చబొల్లారం, సుభాష్ నగర్, పర్వతానగర్, మూసాపేట్, జగద్గిరిగుట్ట, ఎల్లమ్మబండ హంసపేట్, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, షాపూర్‌నగర్, గాజులరామారం సూరారంకాలనీ, వినాయకనగర్, ఏకలవ్యనగర్, మౌలాలీ, సఫిల్‌గూడ, మల్లాపూర్, వెంకట్‌రెడ్డినగర్, నాగోల్, కొత్తపేట్, బోడుప్పల్, పీర్జాదిగూడ, చర్లపల్లి, పేట్‌బషీరాబాద్ యూహెచ్‌సీలకు చెందిన రోగులు మల్కాజిగిరి జిల్లా ఆసుపత్రి సమన్వయంతో ప్రత్యేకసేవలు వినియోగించుకుంటున్నారు.



**సమన్వయంతో సేవలు..**

అనారోగ్య సమస్యలతో ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాలను సంప్రదిస్తున్న రోగులను అక్కడి వైద్యులు పరీక్షిస్తున్నారు. వారికి నిపుణుల సేవలు అవసరమైతే వెంటనే మల్కాజిగిరి జిల్లా ఆసుపత్రి టెలీ మెడిసిన్ వైద్యులను సంప్రదిస్తున్నారు.

ప్రతీరోజు ఉదయం 9 నుంచి పేర్లు నమోదు చేస్తూ.. మధ్యాహ్నం 2 వరకు సేవలందిస్తున్నారు.

◆ ప్రధాన ఆస్పత్రి నుంచి నేరుగా ప్రత్యేక వైద్యనిపుణులు టీవీ, కంప్యూటర్ ద్వారా పీహెచ్‌సీలకు అనుసంధానం చేసిన ట్యాబ్, టీవీ, కంప్యూటర్లో రోగితో మాట్లాడి సమస్యలు తెలుసుకుంటారు. తర్వాత స్థానిక వైద్యాధికారికి సలహాలు, సూచనలు అందిస్తూ చికిత్స అందిస్తున్నారు.శస్త్రచికిత్స అవసరమైన వారిని రిఫర్ చేయాలని సూచిస్తున్నారు. ఇలా ప్రాణాంతక రోగాలను ప్రాథమిక దశలోనే నియంత్రిస్తున్నారు.

**జిల్లాలో లేని సేవలకు హైదరాబాద్ నుంచి..**

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో అవకాశం లేని ఎండోక్రైనాలజీ, కార్డియాలజీ, న్యూరాలజీ, సైక్రియాటిక్ నెఫ్రాలజీ అంకాలజీ, పల్మనాలజీ, సైకోథెరపీ విభాగాలకు చెందిన నిపుణులు హైదరాబాద్‌లోని ఉస్మానియా, నిమ్స్, గాంధీ ఆస్పత్రుల నుంచి టెలీ మెడిసిన్ సేవలను అందిస్తున్నారు.

**వైద్య నిపుణులతో రోజువారీ సేవలు..**

**టెలీ మెడిసిన్ సేవలందించే వైద్య నిపుణులు వారంలో ఒకరోజు అందుబాటులో ఉండేలా షెడ్యూల్ రూపొందించారు.**

| | |
|---|---|
| సోమవారం | – డెర్మటాలజీ, గైనకాలజీ |
| మంగళవారం | – ఆఫ్తామాలజీ, ఈఎన్‌టీ |
| బుధవారం, | – జనరల్, మెడిసిన్ |
| గురువారం | – పీడియాట్రిక్, జనరల్ సర్జన్, గైనకాలజీ |
| శుక్రవారం | – గైనకాలజీ |
| శనివారం | – ఆర్థోపెడిక్ |

## ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

**ఎమ్మెల్యేలు కృష్ణారావు, గాంధీ**



కేన్సర్ పరీక్ష కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పీఏసీ చైర్మన్ గాంధీ తదితరులు



కంటి పరీక్షల కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తదితరులు

**ఆల్విన్‌కాలనీ:** ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ, కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. ఆదివారం రాందేవ్‌రావ్ ఆసుపత్రి ఆధ్వర్యంలో జర్నలిస్టులకు, వారి కుటుంబాలకు ఉచిత మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించారు. క్యాంప్‌నకు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించి కంటి పరీక్షలు చేయించుకున్నారు. రాందేవ్‌రావ్ ఆసుపత్రి మరింత మంది పేదలకు ఉపయోగపడాలని కోరారు. కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ పాల్గొని డయాబెటిక్, న్యూరోపతి, ఫుట్ హెల్త్ కేర్ పొడియటరీ, ఎముకల సాంద్రతను కనుగొనే న్యూట్రిషన్ విభాగాన్ని ప్రారంభించారు. టీయూడబ్ల్యూజే అధ్యక్షులు విరహత్ అలీ గ్యాస్ట్రో ఎంటరాలజీ, ఫైబ్రోస్కాన్‌ని ప్రారంభించారు. ఈ క్యాంప్ విక్రందేవ్‌రావు, మీరారావ్, ప్రశాంత్ రెడ్డి, అపర్ణరావ్, ఆసుపత్రి మెడికల్ డైరెక్టర్ కమలాకర్ ఆధ్వర్యంలో జరిగింది. కార్యక్రమంలో బీజేపీ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు, గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, సీఈఓ యోబు, ప్రముఖ రేఖీ థెరపీ గ్రాండ్ మాస్టర్ శ్రీలక్ష్మీ కమలాకర్ పాల్గొన్నారు.

## కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి

**కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్**



కాలనీ వాసులతో కార్పొరేటర్ నర్సింహయాదవ్

**ఓల్డ్ బోయిన్‌పల్లి:** కాలనీ సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ అన్నారు. ఆదివారం డివిజన్ పరిధిలోని పీవీ ఎన్‌క్లేవ్ కాలనీలో అసోసియేషన్ సభ్యులు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. స్థానిక సమస్యలపై ఆరా తీశారు. కమ్యూనిటీహాల్‌కు రిటర్నింగ్ వాల్, వీధి దీపాలు, పారిశుద్ధ్య నిర్వహణ, అధ్వానంగా మారిన డ్రైనేజీలపై కాలనీ సభ్యులు కార్పొరేటర్ దృష్టికి తెచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. సమస్యలు పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. సమావేశంలో కాలనీ అసోసియేషన్ సభ్యులు జగదీష్, కృష్ణ, మినీపాండే, రవి నింజల్, నారాయణరావు, మల్లేష్‌యాదవ్ పాల్గొన్నారు.

## పాఠశాలలో రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న యువకులు

**మూసాపేట:** భరత్‌నగర్ కాలనీలోని శ్రీ వివేకానంద కాన్వెంట్ హైస్కూల్‌లో అశ్వ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరంలో 100కి పైగా యువకులు రక్తదానం చేశారు. కార్యక్రమాన్ని పాఠశాల కరస్పాండెంట్ ధనదుర్గ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తలసీమియా పిల్లల కోసం 14 సంవత్సరాలుగా రక్తదాన శిబిరం ద్వారా రక్తాన్ని సేకరించి అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ వలంటీర్లు ధనేశ్, తన్మయ, వెంకటేష్, వినయ్, భార్గవి, పద్మజ, లోకేశ్వరి, దుర్గాప్రసాద్, మనికుమార్, నాగరాజు, సంతోష్, నరేష్ రాజు, శివ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## వర్సిటీలు ఉన్నత ప్రమాణాలతో విద్యనందించాలి

**హయ్యర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ చైర్మన్, ప్రొఫెసర్ వి. బాలకిష్టారెడ్డి**



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కౌన్సిల్ చైర్మన్ ప్రొఫెసర్ వి. బాలకిష్టారెడ్డి, ఎంఎస్ రాజు

**కూకట్‌పల్లి:** వర్సిటీలు ఉన్నత ప్రమాణాలతో విద్యనందించాలని తెలంగాణ హయ్యర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ చైర్మన్ ప్రొఫెసర్ వి. బాలకిష్టారెడ్డి అన్నారు. ఆదివారం కూకట్‌పల్లి వై జంక్షన్ వద్ద ఎంఎస్ఆర్ యూనివర్సిటీ సెంట్రల్ అడ్మిషన్ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారత్‌కు అధిక జనాభా భారం కానే కాదనీ, యువ శక్తి కాళ్లమీద నిలబడేలా విద్యా వ్యవస్థను పటిష్టం చేస్తే ఉత్తమ ఫలితాలు పొందవచ్చన్నారు. కొవిడ్ విద్యా వ్యవస్థను ప్రభావితం చేసిందని, అది విసిరిన సవాళ్లను ఎదుర్కొనేలా సిలబస్ రూపొందించాలని ఆయన విద్యా సంస్థలకు సూచించారు. ఇంటర్ డిసిప్లినరీ విధానానికి టెక్నాలజీని అనుసంధానిస్తే అద్భుతాలు సృష్టించవచ్చన్నారు. ఎంఎస్ఆర్ వ్యవస్థాపకుడు ఎంఎస్ రాజు 50 ఏళ్ల విద్యా ప్రస్థానంపై రూపొందించిన స్ఫూర్తిదాయకమైన డాక్యుమెంటరీని బాలకిష్టారెడ్డి అభినందించారు. అనంతరం యూనివర్సిటీ బ్రోచర్ విడుదల చేసి వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంఎస్ రాజు, చాన్సలర్ ప్రొ. కృష్టాచలం, రవి వర్మ తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమ సంఘం ఎన్నికల నోటిఫికేషన్

**మోతీనగర్:** అల్లాపూర్ డివిజన్ గాయత్రినగర్ సీనియర్ సిటిజన్ ఫోరం ఆధ్వర్యంలో సంక్షేమ సంఘం ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ఎన్నికల అధికారులు కె. సూరిబాబు, టీవీఎస్ రాజు, ఆకుతోట విఠలయ్య ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం ఉదయం 10 నుంచి 12 గంటల వరకు సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు నామినేషన్ ఫారాలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. 11న దరఖాస్తులు పూర్తి చేసి ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు అందజేయాలన్నారు. 13న దరఖాస్తుల పరిశీలన, 15న ఎన్నికల గుర్తుల కేటాయింపు, 23న ఉదయం 9 నుంచి 4 గంటల వరకు ఎన్నికలు, అదే రోజు కౌంటింగ్ నిర్వహించి ఎన్నికల ఫలితాలు ప్రకటిస్తారని తెలిపారు.

## 11 నుంచి శృంగేరి శారద శంకరమఠంలో ప్రవచనం

**మోతీనగర్:** మోతీనగర్‌లోని శృంగేరి శారద శంకర మఠం శాఖలో లీలా శుక విరచిత శ్రీకృష్ణ కర్ణామృతంపై బ్రహ్మశ్రీ డా. చిర్రావూరి శివరామకృష్ణ శర్మచే ప్రవచనం ఉంటుందని ఆలయ ధర్మాధికారి సీఎస్ఆర్ మూర్తి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 11వ తేదీ నుంచి 13వ తేదీ వరకు సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. పరిసర ప్రాంత భక్తులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

## పథకాలు కార్మికులకు అందేలా కృషి



నర్సింహ యాదవ్‌ను సన్మానిస్తున్న నేతలు

**మూసాపేట:** ప్రభుత్వం కార్మికుల సంక్షేమానికి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను కార్మికులకు అందేలా కృషి చేస్తానని ఐఎన్‌టీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు కాస నర్సింహయాదవ్ అన్నారు. ఎన్నికైన సందర్భంగా నర్సింహయాదవ్‌ను పలువురు ఆదివారం కలిసి సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కార్మిక రంగం బలోపేతానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో బీదర్ మస్తాన్, ఎండీ హుస్సేన్, షరీఫ్, జావీద్, భీముడు, మైసయ్య తదితరులు పాల్గొన్నారు.

## క్రీడోత్సవ్ బహుమతుల ప్రదానం

**కేపీహెచ్‌బీకాలనీ:** జేఎన్‌టీయూహెచ్‌లో ఏబీవీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడోత్సవ్ బహుమతుల ప్రదాన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి రాంబాబు హాజరై మాట్లాడారు. యువత మత్తు పదార్థాలకు బానిసవ్వటం బాధాకరమన్నారు. విద్యార్థులందరు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఆటల పోటీల్లో గెలిచిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.



బహుమతి అందజేస్తున్న రాంబాబు తదితరులు

## కాలుష్య పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలి



ర్యాలీలో పాల్గొన్న స్థానిక కాలనీల ప్రజలు

**పెద్ద ఎత్తున నిరసన ర్యాలీ**

**నిజాంపేట్ :** కాలుష్యం వెదజల్లే పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేశారు. ఆదివారం మాజీ కార్పొరేటర్ విజయలక్ష్మీ సుబ్బారావు ఆధ్వర్యంలో బాచుపల్లిలో నిరసన ర్యాలీ నిర్వహించారు. బొల్లారం, కాజీపల్లి, బొంతపల్లి, జిన్నారం, పాసిమైలారం మొదలగు పారిశ్రామిక వాడల నుంచి నిబంధనలకు విరుద్ధంగా శుద్ధి చేయకుండా విషవాయువులను విడుదల చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న పరిశ్రమలను నిలువరించడంలో అధికారులు విఫలమయ్యారన్నారు. పొల్యూషన్ బోర్డు అధికారులు ఇప్పటికైనా కళ్లు తెరిచి సంబంధిత పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలన్నారు. సుమారు 2 వేల మంది నిరసన ర్యాలీలో పాల్గొన్నారు. అధికారులు స్పందించకుంటే కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రామారావు శ్రీలక్ష్మి, నందకిషోర్, రవి, హరితవనం కాలనీ, కేఆర్‌సీఆర్ కాలనీ, సాయి అనురాగ్ కాలనీ, కౌశల్య కాలనీ, రెయిన్‌బో కాలనీ, క్రాంతి నగర్, ఎస్ఆర్ఆర్ ప్రైడ్, ప్లెజంట్ విల్లా, ప్రణీత్ వల్లీ, ప్రణీత్ జెనీత్, ప్రణీత్ ఆంటిలియా, పీవీఆర్ హైరైస్, శ్రీహోమ్స్ కాలనీ, కావ్య అవెన్యూ, రిసినియా ట్రెండిల్లా, కేవీఆర్ వ్యాలీ, మల్లంపేట్, ఖాజీపల్లి, బౌరంపేట్ కాలనీ వాసులు పాల్గొన్నారు.




ప్లకార్డుతో చిన్నారి

## దోపిడీకి వ్యతిరేకంగా పోరాడిన ధీరుడు పాపన్నగౌడ్



సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న వివేకానంద్, శ్రీనివాస్‌గౌడ్, స్వామిగౌడ్

**కుత్బుల్లాపూర్:** బడుగు, బలహీన వర్గాలపై జరుగుతున్న అణచివేత, దోపిడీకి వ్యతిరేకంగా పోరాడిన మహాయోధుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ అని బీఆర్ఎస్ శాసన సభ విప్, ఎమ్మెల్యే వివేకానంద్, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, శాసనమండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్ అన్నారు. సూరారం కాలనీ తెలుగుతల్లి నగర్‌లో కౌండిన్య మహాముని గౌడ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఆదివారం ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మొగలుల దురాగతాలపై పోరాడిన సర్వాయి పాపన్న గోల్కొండ కోటపై జెండా ఎగురవేశారన్నారు. అంతకుముందు స్థానికంగా ఉన్న రేణుకా ఎల్లమ్మ తల్లి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జబర్దస్త్ ఫేమ్ అభినవ్, మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు పోలే శ్రీకాంత్, ఫిషరీస్ కోఆపరేటివ్ చైర్మన్ మన్నె రాజు, ములుగు మాజీ ఎంపీపీ అంజన్‌గౌడ్, సీఐ వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు వారాల వినోద్, వెంకటయ్య, తారా సింగ్, గుబ్బాల లక్ష్మీ నారాయణ, రాజ్ కుమార్, గౌడ సంఘం డివిజన్ ప్రెసిడెంట్ కొత్త గౌడ సతీష్ కుమార్, కౌండిన్య మహాముని గౌడ సంఘం అధ్యక్షులు ఎంఎస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

- పీఏసీ చైర్మన్ గాంధీ, ఎమ్మెల్యే కృష్ణారావు
- వివిధ వృత్తుల్లో రాణిస్తున్న మహిళలకు సన్మానం



మహిళలను సన్మానిస్తున్న పీఏసీ చైర్మన్ గాంధీ, కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ తదితరులు

**ఆల్విన్‌కాలనీ:** మహిళలు ఎంచుకున్న రంగాల్లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పీఏసీ చైర్మన్ గాంధీ, ఎమ్మెల్యే కృష్ణారావు అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆల్విన్‌కాలనీ డివిజన్ కాలనీ ఫేజ్ 2లోని ఎంఎల్ఎన్ గార్డెన్స్‌లో ఆదివారం కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. వివిధ రంగాల్లో ప్రతిభ కనబర్చిన మహిళలను ఎంబీసీ అభివృద్ధి సంస్థ చైర్మన్ జెరిపేటి జైపాల్, వియాట్రిస్ భారత సీఎస్ఆర్, పరిపాలన సేవల అధిపతి మిషెల్ డోమినికతో కలిసి సన్మానించారు. కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్, నాయకుడు దొడ్ల రామకృష్ణగౌడ్ పారిశుద్ధ్య కార్మికుల కాళ్లను కడిగారు. అనంతరం ఎమ్మెల్యేలు మాట్లాడుతూ.. మహిళలు ఎదుగుతూ ఇతరులకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. స్త్రీ లేనిదే సమాజం లేదన్నారు. ప్రతి ఒక్కరూ వారిని గౌరవించాలన్నారు.

**మహిళలపై దాడులను అరికట్టాలి**

**బాలానగర్:** మహిళలపై దాడులను అరికట్టాలని మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు హైమావతి, లక్ష్మి అన్నారు. సీపీఐ మండల పార్టీ కార్యాలయంలో ఆదివారం మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలకు అన్ని రంగాల్లో సమాన హక్కులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ కూకట్‌పల్లి మండల కార్యదర్శి జి. కృష్ణ, ఉమాదేవి, రాములు, కృష్ణాచారి, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

**రాందేవ్‌రావ్ ఆసుపత్రిలో మహిళా దినోత్సవం**

**ఆల్విన్‌కాలనీ:** రాందేవ్‌రావ్ ఆసుపత్రిలో ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రాందేవ్‌రావ్ ఆసుపత్రి, శివానంద రిహాబిలేషన్ సెంటర్, కుముదిని దేవి కాలేజ్ ఆఫ్ నర్సింగ్‌లో పనిచేస్తున్న మహిళలను సత్కరించారు. కార్యక్రమంలో ఆసుపత్రి మెడికల్ డైరెక్టర్ డాక్టర్ కమలాకర్, ప్రముఖ రేఖీ థెరపీ గ్రాండ్ మాస్టర్ శ్రీలక్ష్మీ కమలాకర్, సీఐఓ డాక్టర్ యోబు తదితరులు పాల్గొన్నారు.

**స్వయం ఉపాధితో ఎదగాలి**

**మోతీనగర్:** మహిళలు స్వయం ఉపాధితో ఎదుగుతూ నలుగురికి ఉపాధి కల్పించే వృత్తిని ఎంచుకోవాలని సేవా భారతి చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి బి. సీతారామయ్య, ఎన్. బైరెడ్డి అన్నారు. ఆదివారం మూసాపేట డివిజన్, మోతీనగర్ కమిటీ హాల్‌లోని ఉచిత కుట్టు శిక్షణ కేంద్రం ఆవరణలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. మహిళలచే కేక్ కట్ చేయించారు. కార్యక్రమంలో సీఎస్ఆర్ మూర్తి, ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మహిళా దినోత్సవంలో పాల్గొన్న లక్ష్మి, హైమావతి తదితరులు



మహిళా దినోత్సవంలో ఆసుపత్రి నిర్వాహకులు తదితరులు



మహిళా దినోత్సవంలో పాల్గొన్న ట్రస్టు ప్రతినిధులు సీతారామయ్య, బైరెడ్డి, సీఎస్ఆర్ మూర్తి